క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు



బాదుల్లాస్వామి పీరుకు ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నె గ్రామంలోని పీర్ల చావిళ్లలో జియారత్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం పండుగ ముగిసి 40 రోజులు కావడంతో బాదుల్లాస్వామి, బార్ఇమాంపీర్ల జార్తలను పురస్కరించుకుని పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంతోపాటు కోవెలకుంట్ల, అమడాల, ముదిగేడు, వెలగటూరు, బిజనవేముల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చావిళ్ల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మద్దిలేటిస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి



జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు, ఆలయ సిబ్బంది

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామిని కర్నూలు జిల్లా జడ్జి జి.కబర్ది ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఆయన వెంట డోన్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ ఉన్నారు.

మంగపల్లెలో వైద్య శిబిరం



వైద్య శిబిరానికి తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు గుండె, బీపీ, షుగర్, కంటి ఊపిరితిత్తులు, ఎముకలు, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మౌలాలి రెడ్డి, పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవోపా అధ్యక్షుడి మృతి



మాకం కృష్ణ కిశోర్ (ఫైల్)

డోన్ టౌన్: డోన్ అవోపా అధ్యక్షుడు కొత్తపల్లె మాకం క్రిష్ణకిషోర్(64) ఆదివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈయన 2009 నుంచి డోన్ అవోపా సంఘం అధ్యక్షుడిగా ఉంటున్నారు. అవోపాతో పాటు 16 ఏళ్లు ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేశారు. ఆయన మృతదేహానికి అవోపా, ఆర్యవైశ్య సంఘం, వివేకానంద సేవా సమితి సభ్యులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పెద్దరాజు స్వామి గంధోత్సవం



దర్గా పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని నాగమళ్లకుంట గ్రామంలో వెలసిన పెద్దరాజు స్వామి దర్గాలో గంధం, జెండా మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు గూటుపల్లె పెద్ద రాజు స్వామి దర్గా పీఠాధిపతి గురుసయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంగళవాయిద్యాలు, పకీర్ల గాన కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో దర్గా పీఠాధిపతికి స్వాగతం పలికారు. అనంతరం పెద్ద రాజు స్వామి దర్గాలో గంధం, జెండా మహోత్సవం నిర్వహించారు.

సాయిబాబా ఆలయంలో చోరీకి యత్నం

కోవెలకుంట్ల: జోళదరాశి గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామ శివారులో ఉన్న సాయిబాబా ఆలయంలో హుండీ, విలువైన వస్తువులు చోరీ చేసేందుకు దొంగలు ప్రయత్నించారు. ఆలయ తలుపులు పగలగొడుతున్న శబ్దం రావడంతో గమనించిన స్థానికులు అక్కడికి చేరుకునేలోపు దుండగులు పారిపోయారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సెక్యూరిటీని పెంచాలి



ప్రభుత్వ వైద్యశాలల్లో వీలైనంత వరకు సెక్యూరిటీని పెంచాలి. ఆస్పత్రుల్లోని ప్రతి విభాగాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ప్రజల్లో మార్పు వచ్చి చైతన్యవంతులు కావాలి. వైద్యురాలిపై హత్యాచారం చేసిన దోషులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలి. మద్యం సేవించి ఆస్పత్రులకు వచ్చేవారిని అనుమతించకుండా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, కోవెలకుంట్ల



అఘాయిత్యాలను నియంత్రించాలి



విధి నిర్వహణలో ఉన్న మహిళలపై ఇటీవల వరుసగా అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అఘాయిత్యాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు పడేలా చూడాలి. పలు సందర్భాల్లో మహిళలు బయటకు చెప్పుకోలేని విధంగా వేధింపులకు గురవుతున్నారు. వీటిని కూడా నియంత్రించాల్సిన అవసరం ఉంది. వైద్యశాఖలో పనిచేసే మహిళలు విధి నిర్వహణలో ఒంటరిగా గ్రామాల్లో తిరగాల్సి వస్తుంది. ఇలాంటి వారికి రక్షణ కల్పించాలి.

– పద్మావతి, ఏఎన్ఎం, కలచట్ల, ప్యాపిలి



వరినాట్లు వేస్తున్న కూలీలు



కాపులపల్లి గ్రామంలో మిరప సాగు

ఆదాయం 'వరి'ంచేనా..!

- ఎస్సార్‌బీసీ నీటి విడుదలతో జోరుగా వరినాట్లు
- గత ఏడాది కంటే పెరిగిన సాగు విస్తీర్ణం
- కష్టాల నుంచి గట్టెక్కుతామని రైతుల ఆశలు

ఎస్సార్‌బీసీ ఆయకట్టు పరిధిలోని మండలాలు
బనగానపల్లె, అవుకు,కోవెలకుంట్ల, సంజామల, పాణ్యం,గడివేముల,నంద్యాల
ఆయకట్టు పరిధి 1.62 లక్షల ఎకరాలు





బనగానపల్లె మండలంలో ప్రవహిస్తున్న ఎస్సార్‌బీసీ నీరు, మండల పరిధిలో వేసిన వరినాట్లు

బనగానపల్లె రూరల్: మండలంలో వరినాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కాస్త ముందుగానే కురిసినా ఆ తర్వాత తగినంత వర్షపాతం నమోదు కాలేదు. దీంతో రైతులు వరి నాట్లు వేసేందుకు వెనుకాడారు. అయితే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీశైలం డ్యామ్ పూర్తిస్థాయిలో నిండి, గోరుకల్లు రిజర్వాయర్‌కు తగినంత నీరు చేరుకుంది. దీంతో అధికారులు ఎస్సార్‌బీసీ అనుసంధానంగా ఉన్న పంట కాల్వలకు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు వ్యవసాయ బోర్లతో పాటు ఎస్సార్‌బీసీ ఆయకట్టు పరిధిలో వరినాట్లు వేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గత ఏడాది వరి పంటకు మంచి గిట్టుబాటు ధర లభించినా, పంట దిగుబడి ఆశించినంత రాలేదు. గత ఏడాది సుమారు 3 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం 5 వేల ఎకరాల వరకు ఉండే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వరితో పాటు మిరప, మొక్కజొన్న పంటలను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తునట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా వరికి ఆశించిన ధర లభిస్తుందన్న ఆశతో వరి సాగు చేస్తున్నారు.

నీటి విడుదలతో జోరుగా సాగు

బనగానపల్లె: ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ ద్వారా అధికారులు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలో బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల, నంద్యాల నియోజకవర్గంలోని నంద్యాల మండలాలు ఉన్నాయి. ఇందులో 1.62లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 15 రోజులుగా ఎస్సార్‌బీసీ ద్వారా గోర్లుకల్లు రిజర్వాయర్ నుంచి సుమారు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గత నెలలో కురిసిన వర్షానికి ఆయకట్టు పరిధిలో మిరప, మొక్కజొన్న, మినుము తదితర పంటలను సాగు చేశారు. ఎక్కువ శాతం విస్తీర్ణంలో వరిని సాగు చేస్తున్నారు. ఈ పంటలకు సాగునీరు అవసరం ఉన్న సమయంలో ఎస్సార్‌బీసీ ద్వారా నీటి విడదల చేయడంతో పంటలకు నీటి తడులను అందిస్తున్నారు.



మిట్టపల్లెలో ట్రాక్టర్ ద్వారా మొక్కజొన్న విత్తనం వేస్తున్న రైతు

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల మండలంలో వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి సోమవారం నుంచి పగటి పూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

నేటి నుంచి సామూహిక భగవద్గీత పారాయణం

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో సోమవారం నుంచి శనివారం వరకు సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు హిందూ భక్త సమాజం నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి నాలుగు విడతలుగా, చిన్నారులకు ఉదయం 7:30 గంటల నుంచి 8:15 గంటల వరకు జరుగుతుందన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

కోవెలకుంట్ల: గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. వారి ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని ప్రజలతో మంచిగా నడుచుకోవాలని సూచించారు. వారి ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు పోలీసులు భావిస్తే రౌడీషీట్లు ఎత్తివేస్తామని పేర్కొన్నారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

కొలిమిగుండ్ల: మండల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అంకిరెడ్డిపల్లెలోని గీతాశ్రమంలో 28వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు గీతాపారాయణం పఠించనున్నారు. బెలుం, నందిపాడుతో పాటు కొలిమిగుండ్ల, మీర్జాపురం, నాయినపల్లె గ్రామాల్లో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 26న నాయినపల్లె, సెప్టెంబర్ 2న మీర్జాపురం, 4న కొలిమిగుండ్లలో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు త్రైతసిద్ధాంత భక్తులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో భక్తులకు అన్నదానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని స్టేట్‌బ్యాంకు రోడ్‌లో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుంచి ఆరు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ప్రబోధ సేవాసమితి సభ్యులు పేర్కొన్నారు.

ప్యాపిలి: త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం నుంచి కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శివ ప్రసాద్, సుధాకర్, నాయుడు, కేశవ, రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాపిలి, హుసేనాపురం, మెట్టుపల్లి, ఏనుగుమర్రి, జలదుర్గం తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వంటింటి చిట్కాలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ గీతా

బనగానపల్లె: వంటింటి చిట్కాలను పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ గీతా అన్నారు. ఆదివారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య భారతి శిక్షణ కార్యక్రమంలో పలువురు వైద్యులు ప్రసంగించారు. ఊబకాయం సమస్యలపై స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ మాధవరావు మాట్లాడారు. ఆరోగ్య సూత్రాలపై ఆయుర్వేద వైద్యులు పలు సూచనలు చేశారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు వంటింటి చిట్కాలు మంచి ఫలితాలు ఇస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యభారతి క్షేత్ర అధ్యక్షుడు కుమారస్వామి, ఆరోగ్య భారతి జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు వంగల పరమేశ్వరరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.


మట్టి వినాయకులే ఉత్తమం



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ వినాయకచవితి పండుగకు మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోవాలని పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరి హుసేన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయా కాలనీల్లో విగ్రహాలు నెలకొల్పే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహాలు ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు ఉత్సవ కమిటీ నిబంధనలు పాటించాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఊరేగింపు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మారుతి కృష్ణ, పుల్లారెడ్డి, హరి, నాగమోహన్, వీరారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



స్పీడ్ బ్రేకర్ లేని టంగుటూరు పీహెచ్‌సీ రోడ్డు

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఎదుట స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో శిథిలావస్థలో చిన్న గదుల్లో వైద్యశాల ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కాటసాని రామిరెడ్డి వైద్యశాలకు సుమారు రూ.1.50 కోట్లు మంజూరు చేయించి ఆధునిక వసతులతో కూడిన వైద్యశాలను నిర్మించారు. ఈ వైద్యశాల ఎదురుగానే నేషనల్ హైవే ఉండడంతో వందలాది వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రధాన రోడ్డు పక్కలోనే వైద్యశాల ఉండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వృద్ధులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ



రొట్టె, గుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులు, బాలింతలు, వారి సహాయకులకు రొట్టెలు, గుడ్లు పంపిణీ చేశారు. ప్యాపిలి మండలం బావిపల్లెకు చెందిన రెడ్డి జనార్దన్ సహకారంతో ఆదరణ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ వీటిని అందజేశారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య అష్టోత్తరం చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు.




రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి శాంతియుత జీవనం గడపాలని సీఐ డి. వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఎస్ఐ పి.అశోక్ ఉన్నారు.

30 వేల క్యూసెక్కుల నీటి విడుదల



బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 30,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 30 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. ఈ నీటినంతా దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జీఎన్ఎస్ఎస్‌కు 14 వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 4 వేల క్యూసెక్కులు, తెలుగుగంగ (వీబీఆర్)కు 12 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

సారా బట్టీలపై దాడులు



నాటు సారా తయారీ బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలోని నాటు సారా తయారీ బట్టీలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. హరినగరం సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి వెళ్లి 10 డ్రమ్ముల్లో నిల్వ ఉన్న 1800 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. అలాగే సారా తయారీ కోసం ఏర్పాటు చేసిన బట్టీని, డ్రమ్ములను మొత్తం ధ్వంసం చేశామని ఎస్ఐ వరప్రసాదు తెలిపారు.

మంచిగా మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐ

అవుకు: అందరితో మంచిగా మెలిగితే జీవితం సంతోషంగా ఉంటుందని.. గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బనగానపల్లె సీఐ మంజునాథ రెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డి రౌడీషీటర్లను హెచ్చరించారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అవుకు మండల పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందరిపై నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు



విజేతలకు బహుమతులు అందజేత

శాస్త్రీయ దృక్పథంతో అభివృద్ధి

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

డోన్ టౌన్: సమాజంలో మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, అశాస్త్రీయ భావాలు విడనాడి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి ముందుకు వెళితే అభివృద్ధి సాధ్యపడుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని క్లబ్ హౌస్‌లో జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన వార్షిక సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వం మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకునిరావాలని డిమాండ్ చేశారు. దొంగబాబాల మాయలో అమాయక ప్రజలు పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా నాట్యమండలి కళాకారులు పాడిన పాటలు, విద్యార్థులు చేసిన మ్యాజిక్ షోలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, సాహితీవేత్త తొగట సురేష్‌బాబు, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, వివిధ సంఘాల నాయకులు నరసింహులు, ప్రసాద్, సుబ్బరాయుడు, మౌలాలి, అబ్దుల్ లతీఫ్, రామమూర్తి, నాగరాజు, శివరామ్ పాల్గొన్నారు.